సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం । 23 । మే । 2023



అన్ని రంగాల్లో అభివృద్ధి

పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. - 8లో▸



వీసీ పాలన గాడిన పడినట్లేనా?

కేయూలో వీసీ రమేశ్ ఆధ్వర్యంలో పలు సమస్యలు పరిష్కారం కాగా మరికొన్ని అలాగే ఉండిపోయాయి. వీసీగా బాధ్యతలు చేపట్టి నేటితో రెండేళ్లు పూర్తి చేసుకున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
41.5°/25.4°

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగి వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

ములుగు: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో భాగస్వాములైన ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిబంధనల మేరకు పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏళ్ల మధుసూదన్, శిరుప సతీశ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐదేళ్లుగా పదోన్నతులు లేక ఉపాధ్యాయులు నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారని వాపోయారు. పీఆర్సీ గడువు ముగుస్తున్న కారణంగా నూతన కమిటీ ఏర్పాటుకు సహకరించాలని ఇంటీరియర్ రిలీఫ్‌ను మంజూరు చేయాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్‌లుగా విధులు నిర్వహిస్తున్న వారికి జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు.

పోలీస్ అధికారులకు పదోన్నతులు

వరంగల్ క్రైం: రాష్ట్రంలో పలువురు పోలీస్ అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డీఎస్పీ నుంచి అడిషనల్ ఎస్పీ, అడిషనల్ ఎస్పీ నుంచి నాన్ కేడర్ ఎస్పీలుగా పలువురికి పదోన్నతులు లభించాయి. డీఎస్పీ నుంచి అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందిన వారిలో వరంగల్ రీజియన్‌లో డీఎస్పీలు బి.రమేష్, ఆర్.ప్రభాకర్‌రావు, కె.వెంకట్‌రావు, జి.బాలస్వామి, కె.పృథ్వీధర్‌రావు, బి.శ్రీకృష్ణగౌడ్, జి.వెంకటేశ్వరబాబు ఉన్నారు. అడిషనల్ ఎస్పీ నుంచి ఎస్పీగా పదోన్నతి పొందినవారిలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో అడిషనల్ డీసీపీ పుష్పారెడ్డి, గతంలో వరంగల్‌లో పనిచేసిన పుల్లా శోభన్‌కుమార్, శ్రీనివాస్, సునితామోహన్, చంద్రమోహన్, శ్రీనివాస్‌లు ఉన్నట్లు సమాచారం.

దరఖాస్తు చేసుకోవాలి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని సమగ్రశిక్ష ప్రాజెక్టులోని కాంట్రాక్టు ఉద్యోగులైన డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఐఈఆర్‌పీలు, సిస్టం అనలిస్టులు, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్లు బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలని సోమవారం డీఈఓ ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. ఆయా ఉద్యోగులు హెచ్‌టీటీపీఎస్//స్కూల్ ఎడ్యు.తెలంగాణా.గౌట్.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు. ఈ నెల 23నుంచి 25వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తారని, పూర్తి మార్గదర్శకాలు వెబ్‌సైట్‌లో పొందుపర్చారని తెలిపారు.

లీగల్ మెట్రాలజీ అడ్వయిజరీ కమిటీలో చక్రపాణి

వరంగల్: వినియోగదారుల హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర వహిస్తున్న లీగల్ మెట్రాలజీ రూల్స్–2011ను మరింత పటిష్టవంతంగా రూపొందించేందుకు కేంద్ర వినియోగదారుల మంత్రిత్వశాఖ 11సభ్యులతో అడ్వయిజరీ కమిటిని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో తెలంగాణా రాష్ట్రం నుంచి వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి సభ్యులుగా నియమితులయ్యారు.సీసీఐ జాతీయ అధ్యక్షుడు డా. అరుణ్ కుమార్, ఉపాధ్యక్షుడు చదలవాడ హరిబాబు, ప్రిన్సిపల్ జనరల్ సెక్రటరీ దేవేంద్ర తివారీలతో పాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో కమిటీ ఏర్పడిందని చక్రపాణి తెలిపారు.

సినీనటుడు శరత్‌బాబుకు జిల్లా కళాకారుల సంతాపం

హన్మకొండ కల్చరల్ : ప్రముఖ సినీ నటుడు శరత్‌బాబు మృతికి జిల్లా కళాకారులు సంతాపం తెలిపారు. సినీ రంగానికే కాక శరత్‌బాబు మొదట నాటక రంగంలో రాణించారని, ప్రగతి ఆర్ట్ అసోసియేషన్ ద్వారా ఎన్నో నాటకాలను ప్రదర్శించారని, ఆయనకు కళాకారులంటే చాలా అభిమానం అని జిల్లా పౌరాణిక, పద్యనాటక కళాకారులు గుర్తుచేశారు. సంతాపం తెలిపిన వారిలో సీనియర్ పద్యనాటక కళాకారులు మారేడోజు సదానంద చారి, జెఎస్ శర్మ, బిటవరం శ్రీధరస్వామి, తెలంగాణ డ్రమెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆకుల సదానందం, జేబీ కల్చరల్ నిర్వహకులు జడల శివలు ఉన్నారు.

క్రీడలతోనే స్నేహభావం

ఏటూరునాగారం: క్రీడలతోనే స్నేహభావం పెంపొందుతుందని రాష్ట్ర క్రీడా అథారిటీ చైర్మన్(శాట్స్) డాక్టర్ ఈడిగ ఆంజనేయగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ క్రీడా ప్రాంగణంలో సీఎం కప్– 2023 జిల్లా క్రీడలను ఈడిగ ఆంజనేయగౌడ్, జెడ్పీ చైర్మన్ జగదీశ్, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్, ఏఎస్పీ సంకీర్త్‌తో కలిసి ఆయన సోమవారం జ్యోతిప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో కేవలం మానసికోల్లాసమే కాకుండా జీవితంలో ఓర్పు, సహనం, ఏకాగ్రత లక్షణాలు పెరుగుతాయన్నారు. రాష్ట్రంలో అనేక పోరాటాలు చేసిన తమకు క్రీడల్లో నేర్చుకున్న వాటితోనే ఈ స్థాయికి వచ్చామన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రం సాధించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని తెలిపారు.

ఎస్‌ఆర్ గార్డెన్ వెనుక అనుమతి లేని ఓ వెంచర్



తొలగించింది రాళ్లే కదా..

అధికారుల చర్యను లెక్క చేయని రియల్టర్లు

- రెండు నెలల్లో అంతా మారుతుందనే ధీమా
- కొనుగోలుదారులకు భరోసా ఇస్తున్న వైనం
- మళ్లీ అడ్డగోలుగా అమ్మేందుకు మాస్టర్ ప్లాన్

భూపాలపల్లి: అనుమతి లేని వెంచర్లపై మున్సిపల్ అధికారులు తీసుకున్న చర్యలను రియల్టర్లు సింపుల్‌గా తీసేస్తున్నారు. తమకు పెద్దగా జరిగిన నష్టమేమీ లేదని, త్వరలోనే సీన్ మొత్తం మారిపోతుందని కొనుగోలుదారులకు భరోసా ఇస్తున్నారు. మళ్లీ మోసానికి పాల్పడేందుకు సిద్ధం అవుతున్నారు.

భూపాలపల్లి పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడిన అనంతరం భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. రూ. 20 లక్షలు ఉన్న ఎకరం భూమి రూ. కోటి నుంచి రూ. 2 కోట్లకు చేరుకొంది. దీంతో స్థానిక, ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. సుమారు ఏడేళ్లపాటు అనుమతి లేకుండా, లే అవుట్ అనుమతితో వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించారు. కాగా ఇటీవల అనుమతి లేని వెంచర్లు విచ్చలవిడిగా వెలిశాయి. దీంతో మున్సిపల్ అధికారులు వాటిపై దృష్టి సారించి చర్యలకు పూనుకున్నారు. గడిచిన వారం రోజుల్లో 57 ఎకరాల్లో 13 అక్రమ లే అవుట్‌లు గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల సమయం ఇచ్చిన అనంతరం ఆయా వెంచర్లలోని హద్దురాళ్లను తొలగించారు. అయినప్పటికీ వారు జంకడం లేదు.

క్రిమినల్ చర్యలు తీసుకుంటారా?

అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భవేష్ మిశ్రా హెచ్చరించారు. ఈ నెల 19న అనుమతి లేని అక్రమ వెంచర్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఆయా వెంచర్ల యజమానులు అనుమతి పత్రాలు, పూర్తి వివరాలు వారం రోజుల్లో చూపించాలని ఆదేశించారు. లేని పక్షంలో నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ మేరకు రియల్టర్లపై తీసుకోబోయే చర్యలపై జిల్లా కేంద్రంలో తీవ్ర చర్చ సాగుతోంది.

ఏం కాదు.. ప్లాట్లు కొనుక్కోండి..

ఓవైపు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నా, పెద్దగా ఒరిగిందేమీ లేదంటూ మరోవైపు రియల్టర్లు ప్రచారం చేస్తున్నారు. రానున్న రోజుల్లో భూముల ధరలు విపరీతంగా పెరుగుతాయని, ప్లాట్లు కొనుక్కునే వారు ఇప్పుడే కొనుక్కోవాలని సూచిస్తున్నారు. నోటీసులు, హద్దురాళ్ల తొలగింపు సాధారణమేనని బుకాయిస్తున్నారు. రెండు, మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, అధికారుల బదిలీలు ఉంటాయని, రానున్న అధికారులతో ఇబ్బంది ఏమీ ఉండదంటూ ప్లాట్లను విక్రయించేందుకు యత్నిస్తున్నారు. ప్రస్తుతం తమకేమీ కాలేదని, 'రియల్' రంగానికి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదనట్లుగా వ్యవహరిస్తున్నారు.

మమ అనిపించిన మున్సిపల్ అధికారులు

మున్సిపల్ అధికారుల చర్యలు కూడా 'మమ' అన్నట్లుగానే కనిపిస్తున్నాయి. వాస్తవానికి నూతన మున్సిపల్ చట్టం ప్రకారం అనుమతి లేకుండా లే అవుట్ ఏర్పాటు చేస్తే తొలుత సంబంధిత రియల్టర్‌కు నోటీసులు జారీ చేయాలి. అనంతరం వెంచర్‌లోని హద్దురాళ్లతో పాటు నిర్మాణాలు ఏమైనా ఉంటే తొలగించాలి. అయినప్పటికీ ప్లాట్ల విక్రయాలు జరిపితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. కానీ భూపాలపల్లి మున్సిపాలిటీలో మొదటి నుంచి ఇందుకు భిన్నంగా జరుగుతోంది. గతంలో అనేకమార్లు నోటీసులు, హద్దు రాళ్ల తొలగింపుతోనే సర్ది పుచ్చారు. అదే మాదిరిగా ఇప్పుడు కూడా చేశారు. కానీ అయా అనుమతి లేని వెంచర్లలోని కట్టడాలను ముట్టుకోలేదు. నేటికీ వెంచర్ల చుట్టూ పెద్ద పెద్ద ప్రహరీలు, ఆర్చ్‌లు, ఆఫీస్ రూంలు దర్శనమిస్తున్నాయి. దీంతో జరిగింది పాత కథే కదా అన్నట్లుగా ఉంది.

సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి రూరల్: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్ హౌస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 32 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీ ఓ, సామ్యూల్, డీఆర్‌డీఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి..

ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టరేట్ కార్యాలయంలో సంబంధించిన అధికారులతో సోమవారం రివ్యూ నిర్వహించారు. యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి జిల్లాలో జరుగుతున్న పనుల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో 186 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 12,330 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, మరో 20 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉందని తెలిపారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి చేసేందుకు స్థలం ఇబ్బంది ఉన్న నేపథ్యంలో ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాలకు సమీపంలో తాత్కాలికంగా ధాన్యం భద్రపరిచేందుకు అవకాశం ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, సింగరేణి సంస్థ భవనాలు, వివిధ ప్రదేశాలు గుర్తించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్లు ప్రతిరోజూ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జేసీ స్వర్ణలత, తదితర అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలు పచ్చదనంతో ఉండాలి

మొగుళ్లపల్లి: గ్రామాలు పచ్చదనంతో ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం మొగుళ్లపల్లి, పిడిసిల్ల, ముల్కలపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయా గ్రామాల్లోని నర్సరీలు, పల్లె ప్రకృతివనాలు, శ్మశాన వాటికలు, సెగ్రిగేషన్ షెడ్‌లు, పలు కాలనీలను ఆమె పరిశీలించారు. అనంతరం పిడిసిల్ల గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు నిర్వహించాలన్నారు. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ వాడితే జరిమానా విధించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్ట్ ఎరువు తయారు చేయాలన్నారు. ఆమె వెంట ఎంపీఓ వినోద్‌కుమార్, సర్పంచ్ నైనకంటి ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, నరేష్, మౌనిక తదితరులు ఉన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ

బాధితులకు అండగా ఉంటాం..

టేకుమట్ల (రేగొండ): అకాల వర్షానికి ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు అండగా ఉంటామని డీపీఓ ఆశాలత అన్నారు. రేగొండ మండల పరిధిలోని దామరంచపల్లిలో అకాల వర్షానికి ఇండ్లు ధ్వంసమైన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వానికి నివేదిక పంపించి బాధితులను ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఆమె వెంట ఎంపీడీవో సురేందర్, ఎంపీ ఓ రాంప్రసాదరావు తదితరులు ఉన్నారు.

ప్రతీ ఫిర్యాదుపై స్పందించాలి

ఎస్పీ సురేందర్ రెడ్డి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ సురేందర్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్: పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుపై స్పందించి తగిన విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సురేందర్ రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన 16 దరఖాస్తులను స్వీకరించారు. ఈ ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..ఫిర్యాదుల్లో వృద్ధాప్యంలో వారసులు పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, భూ వివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీ లు, భార్యాభర్తల సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. బాధితుల ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు.

కేంద్రం సింగరేణిలో వాటాను ఉపసహరించుకోవాలి

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి ఉన్నటువంటి 49శాతం వాటాను ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. టీబీజీకేఎస్ కూడా కార్మికుల కొరకు పని చేస్తూ కార్మికుల నుంచి ప్రశంసలు పొందాలన్నారు. నూతనంగా నియామకమైన బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బడితెల సమ్మయ్యకు సహకరించాలని సూచించారు. ఇతర యూనియన్లు చేసే ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు. సింగరేణి కార్మికులకు నూతనంగా నిర్మించిన డబుల్‌బెడ్ రూం క్వాటర్లను పూర్తిగా కార్మికులకే కేటాయించడం జరుగుతుందన్నారు.

బ్రాంచ్ ఉపాధ్యక్షుడిగా బడితెల సమ్మయ్య

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) బ్రాంచ్ ఉపాధ్యక్షుడిగా బడితెల సమ్మయ్యను నియమిస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావ్ ప్రకటించారు. వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎల్ శ్రీనివాస్, రత్నం అవినాష్, నరేష్‌నేత, మునిగాల సురేష్‌లను నియమించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, కార్యనిరహక అధ్యక్షుడు కెంగర్ల మల్లయ్య, నాయకులు సదానందం, సంపత్, మధు, రవిలు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

భూపాలపల్లి అర్బన్: క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకుంటూ క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో 3 రోజుల పాటు నిర్వహించనున్న జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను సోమవారం కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలపై యువతకు ఆసక్తిని పెంచేందుకు ప్రభుత్వం యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. 3 రోజుల పాటు అంబేడ్కర్ స్టేడియంలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. క్రీడాకారులకు భోజన వసతి, తాగునీటి సౌకర్యం, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా స్థాయిలో బ్యాడ్మింటన్, రెజ్లింగ్, బాక్సింగ్, స్విమ్మింగ్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్ పోటీలతో పాటు మొత్తం 11 రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో చిట్యాల, కాటారం మండలాల్లో మినీ స్టేడియాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్ధు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రమేష్, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి , డీవైఎస్‌వో సునీతలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇళ్ల పట్టాల పంపిణీ

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి కార్మికులకు కేటాయించిన ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం పారదర్శకంగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీలో గల సింగరేణి మినీ ఫంక్షన్ హాల్‌లో జీవో నంబర్ 76 కింద క్రమబద్ధీకరించిన ఇళ్ల స్థలాలకు పట్టాల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ భవేష్‌మిశ్రాతో కలిసి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొని మాట్లాడారు. సింగరేణి కార్మికుల చిరకాల కోరిక పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, నిబంధనలు పాటిస్తూ అర్హులందరికీ పట్టాలు అందిస్తున్నామని తెలిపారు. పట్టణంలో ఇంకా 59 మంది అర్హులు ఇప్పటి వరకు నామమాత్రపు రుసుము చెల్లించలేదని, వారిని మినహాయించి మిగిలిన వారందరికీ పట్టాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నామమాత్రపు రుసుము చెల్లించిన వెంటనే వారికి సైతం పట్టాలు అందిస్తామన్నారు. ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసిన భూపాలపల్లి తహశీల్దార్ ఇక్బాలను అభినందించారు. జీవో నంబర్ 76 ప్రకారం సుభాష్‌కాలనీ, కృష్ణకాలనీలో ఇళ్ల పట్టాల కోసం 1,823 దరఖాస్తులు వచ్చాయని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నిబంధనల ప్రకారం 1,630 మంది అర్హులను ఎంపిక చేశారని తెలిపారు. దారిద్ర రేఖకు దిగువన ఉన్న 789 మంది లబ్దిదారులకు పూర్తి ఉచితంగా, దారిద్ర రేఖకు ఎగువన ఉన్న 841 కుటుంబాలకు నామమాత్రపు రుసుముతో రిజిస్ట్రేషన్ చేసి పట్టాలను పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శోభ, మున్సిపల్ చైర్ పర్సన్ వెంకట్రాణి సిద్ధు, గ్రంథాలయ చైర్మన్ రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ హరిబాబు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనుల అడ్డగింత



పనులను అడ్డుకుంటున్న అటవీ శాఖ అధికారులు

ములుగు: జాతీయ రహదారి విస్తరణ పనులను అటవీ శాఖ అధికారులు సోమవారం మరోసారి అడ్డుకున్నారు. గత కొన్ని రోజుల క్రితం 163వ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతుండగా ములుగు మండలం జాకారం–మల్లంపల్లి మధ్యలో రోడ్డు పక్కన ఉన్న భూమి మాదంటే మాదంటున్నారంటే రెవన్యూ, అటవీ అధికారులు చెప్పుకుంటూ వస్తున్నారు. మేడారం మహాజాతరను దృష్టిలో పెట్టుకొని ఎన్‌హెచ్ అధికారులు పనులను శరవేగంగా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న అటవీ అధికారులు అడ్డుకున్నారు. జాకారం–మల్లంపల్లి మధ్యలో 53/2, 53/19, 67/2, 67/19 సర్వే నంబర్ల విషయంలో ఇరుశాఖలకు సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పంచాయతీ రాష్ట్ర సర్కారుకు వెళ్లినా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదు.

హైజీనిక్‌పై అవగాహన సదస్సు



హైజీనిక్ విషయాలను కలెక్టర్‌కు వివరిస్తున్న షఫీ

ఏటూరునాగారం: జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా కార్వెడ్, గ్రామాలయ సంయుక్త సంస్థల ఆధ్వర్యంలో హైజీనిక్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో కార్వెడ్ సంస్థ జిల్లా ప్రాజెక్టు అధికారి షఫీ హైజీన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంపై విద్యార్థులకు, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్, జెడ్పీ చైర్మన్ జగదీశ్, సీఈఓ ప్రసూనరాణిలకు వివరించారు.

ఆయూష్, సైకలాజిస్టు పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ములుగు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న ఆయూష్, సైకలాజిస్టు పోస్టులకు సోమవారం డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య తన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయూష్, ఆర్బీఎస్కే వైద్యాధికారుల పోస్టులు ఐదు ఖాళీగా ఉండగా తొమ్మిది మంది హాజరయ్యారు. సైకలాజిస్టు పోస్టుకు ఎనిమిది మంది హాజరయ్యారు. ఇంటర్వ్యూ అనంతరం మెరిట్ జాబితాను కార్యాలయ గోడపై అతికించారు. సెలక్ట్ అయిన వారిలో సైకలాజిస్ట్ పోస్టుకు కిరణ్‌కుమార్, ఆయూష్ మెడికల్ అధికారిగా స్వప్న, ఆర్‌బీఎస్కే తరపున వెంకటేష్, ప్రత్యూష, ఎస్‌వీ.చంద్ర, రేణుక, కిన్నెర ఎంపికయ్యారు. ఇంటర్వ్యూలో కార్యాలయ సూపరింటెండెంట్ విజయభాస్కర్, ఎన్‌హెచ్‌ఎం మేనేజర్ తిరుపతిరెడ్డి, మాస్ మీడియా అధికారి తిరుపతయ్య పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలి

కలెక్టర్ కృష్ణ ఆదిత్య



ఆయిల్‌పామ్ మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్

ఏటూరునాగారం: జిల్లాలోని రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య సూచించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ పరిధిలో ఉన్న హెచ్‌ఎస్‌టీసీలో ఆయిల్‌పామ్ మొక్కలను కలెక్టర్ సోమవారం నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ మొక్కలను విరివిరిగా నాటి సాగు చేయాలన్నారు. రైతులు పంటల మార్పిడిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే చేయూతతో సాగులో నూతన ఒరవడిని సృష్టించాలన్నారు. అనంతరం ఐటీడీఏ పీఓ అంకిత్ మొక్కలను నాటిన అనంతరం కలెక్టర్‌కు పీఓ మొక్కల గురించి పలు అంశాలు వివరిస్తూ ఏటూరునాగారం హెచ్‌ఎస్‌టీసీ ఎక్రెలలో 8ఎకరాల్లో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ పెంపకానికి పెన్సింగ్, 2 ఎకరాల్లో ఉన్న మామిడి తోట అభివృద్ధి, మిగిలిన ప్రాంతంలో జామ, సపోటా, బత్తాయి, డ్రాగన్ పండ్ల తోటలను పెంచడం జరుగుతుందని పీఓ వెల్లడించారు. భవిష్యత్తులో ఈ తోటల పెంపకం పండ్ల మొక్కల ఉత్పత్తి, పంపిణీకి ఉపయోగపడుతుందన్నారు. ఈ పొలం డ్రిప్ ఇరిగేషన్ విధానంలో ఉంటుందని తెలిపారు. ఆయిల్ పామ్, మామిడి తోటల పెంపకాన్ని నిశితంగా పర్యవేక్షించాలని ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారికి కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, పీహెచ్‌ఓ రమణ, ఎస్‌ఓ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు

భూపాలపల్లి రూరల్: కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కూరకుల స్వర్ణలత అధ్వర్యంలో సోమవారం ఫాదర్ ఆఫ్ దళిత్ మూమెంట్ భాగ్యరెడ్డి వర్మ135వ జయంతి వేడుకలు ఘ నంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి ల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సు నీత, కార్యాలయం ఏఓ మహేష్‌బాబు, త దితర కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న మాజీ మావోయిస్టు మృతి


శివాజీ (ఫైల్)

ఎంజీఎం: మాజీ మావోయిస్టు సూతి శివాజీ (72) వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. శుక్రవారం అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు ఎంజీఎంలో అడ్మిట్ చేశారు. గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన శివాజీ వరంగల్ ఆర్ఈసీలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఆ తర్వాత పీపుల్స్‌వార్ దళంలో చేరాడు. ఆర్ఎస్‌యూ ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించాడు. పీపుల్స్ వార్ నేత కొండపల్లికి సహచరుడు. గెరిల్లా దళాలను ఏర్పాటు చేయడంలో దిట్ట. గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన వారితో పనిచేశాడు. 1990 నుంచి 97 వరకు జైలు జీవితాన్ని గడిపి బయటకు వచ్చాడు. ప్రస్తుతం ఆయన నగరంలోని 22వ డివిజన్ మర్రివెంకటయ్య కాలనీలో నివాసం ఉంటున్నాడు. శివాజీ మృతదేహాన్ని వైద్య విద్యార్థుల విద్యాబోధన కోసం కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగించనున్నట్లు ఆయన కూతురు అమని, కుటుంబ సభ్యులు తెలిపారు.

వాగులో గల్లంతై వృద్ధుడు..


ఉప్పలయ్య(ఫైల్)

నర్సంపేట రూరల్: వాగులో గల్లంతై మండలంలోని మాధన్నపేట గ్రామానికి చెందిన బొల్లేని ఉప్పలయ్య(70) సోమవారం మృతి చెందాడు. ఉప్పలయ్యకు గ్రామ శివారులో, వాగు సమీపంలో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో వరి సాగు చేశాడు. ధాన్యం కోసి ఆరబోయగా.. ప్రతీ రోజు తన గేదెను తీసుకోని వ్యవసాయ భూమి వద్ద మేపుకుని సాయంత్రం ఇంటికి తీసుకొచ్చేవాడు. ఎప్పటిలాగే.. సోమవారం ఉదయం ఉప్పలయ్య తన గేదెను తీసుకుని ఉదయమే ఇంటి నుంచి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో మధ్యాహ్నం వాగులోకి వెళ్లిన గేదెను తీసుకొచ్చేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. సాయంత్రం 7 గంటల సమయంలో గేదె మాత్రమే ఇంటికి రావడంతో కుటుంబీకులు వాగువద్దకు వెళ్లి చూడగా.. ఉప్పలయ్య తువాలు, చెప్పులు కనిపించాయి. స్థానిక సర్పంచ్ మొల్గూరి చంద్రమౌళి, గ్రామస్తులు గజఈతగాళ్ల సాయంతో వాగులో గాలించగా.. ఉప్పలయ్య మృతదేహం లభ్యమైంది.

వీసీ పాలన గాడిన పడినట్లేనా?


మహిళా హాస్టల్ నూతన భవనం ఇదే..


కేయూలో నిర్మిస్తున్న కె హబ్ భవనం

- ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు హాస్టల్ వసతి తొలగింపు
- సదుపాయాలు.. అభివృద్ధి పనులు
- అడ్జెంట్ ప్రొఫెసర్ల నియామకాలు
- అధ్యాపకులకు పదోన్నతులు
- న్యాక్ 'ఏ' గ్రేడ్ నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు
- నేటితో కేయూ వీసీ పాలనకు రెండేళ్లు

కేయూ క్యాంపస్: కేయూలో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆధ్వర్యంలో పలు సమస్యలు పరిష్కారమయ్యాయి. మరికొన్ని అలాగే ఉండిపోయాయి. వీసీగా రమేశ్ పాలన పగ్గాలు చేపట్టి ఈనెల 23తో రెండేళ్లు పూర్తి చేసుకుంటున్నారు. రెండేళ్ల పాలన కొంత ఖేదం, మరికొంత మోదం అన్నట్లుగా కనిపిస్తోంది. యూనివర్సిటీలో అధ్యాపకుల కొరత వేధిస్తూనే ఉంది. వీసీగా బాధ్యతలను చేపట్టినప్పుడు విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశోధనలే కీలకంగా అందించేలా కృషి చేస్తానని వీసీ చెప్పినప్పటికీ ఇంకా ఆదిశగా అడుగులు వేయడం లేదని చెప్పవచ్చు. కొన్నివిభాగాల్లో తరగతులు అంతంత మాత్రమే కొనసాగుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. ఒకసారి స్నాతకోత్సవం కూడా నిర్వహించారు.

న్యాక్ సన్నద్ధానికే సమయం

వీసీ కొన్ని నెలలుగా న్యాక్ సన్నద్ధం కోసం సమయం వెచ్చిస్తూ అధ్యాపకులనూ ఆదిశగానే నడిపిస్తూ వస్తున్నారు. వర్సిటీలో విద్యార్థులు వివిధ సమస్యలపై తరచూ ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. రెండేళ్లయినా పాలన ఇంకా గాడిన పడినట్లేనా? అంటే భిన్నాభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. పలు అంశాల్లో వీసీ రమేశ్ అనేక విమర్శలు కూడా ఎదుర్కొంటున్నారు. పలు అపరిష్కృత సమస్యలున్నాయి. అయినా.. ఎవ్వరినీ పట్టించుకోకుండా తాను అనుకున్నదే చేస్తూ తన మార్క్‌తోనే పాలన కొనసాగిస్తున్నారు.


వీసీ తాటికొండ రమేశ్

నాన్చుడు ధోరణి..

బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి వివిధ సమస్యల పరిష్కారంలో నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారనే విమర్శల్ని వీసీ ఎదుర్కొంటున్నారు. విద్యాబోధనపై పర్యవేక్షణ కొరవడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువగా వీసీ లాడ్జ్ నుంచే పాలన కొనసాగిస్తున్నారు. పరిపాలన భవనంలో తన చాంబర్‌కు అప్పుడప్పుడు మాత్రమే వస్తుండడం కూడా విమర్శలకు తావిస్తోంది.

హాస్టల్ వసతి తొలగింపు..

వీసీ కేయూలో ఎస్ఎఫ్‌సీ సీట్లను పెంచారు. ఈవిద్యాసంవత్సరంలో ఆయా ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు హాస్టల్ వసతి తొలగించి హాస్టల్ అడ్మిషన్లు కల్పించలేదు. దీంతో ఎస్ఎఫ్‌సీ విద్యార్థులు ఆందోళనలు చేశారు. ఆందోళనలు చేసే వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులపై కేసులు పెట్టడం కూడా విమర్శలకు తావిస్తోంది. క్యాంపస్‌లోని పోతన బాయ్స్ హాస్టల్‌లోని విద్యార్థులను న్యూపీజీ బాయ్స్ హాస్టల్‌కు పంపించారు. పోతన హాస్టల్‌లో ఇకపై విద్యార్థినులకు వసతి కల్పించనున్నారు.

నియామకాల్లేవు..

కేయూలో దశాబ్దకాలంగా అధ్యాపకుల నియామకం లేదు. 136 పోస్టులు మంజూరైనా భర్తీకి చర్యలు చేపట్టట్లేదు. రెగ్యులర్ అధ్యాపకులు 100 మంది వరకే ఉన్నారు. అడ్జెంట్ ఆచార్యులను 12 మందిని నియమించారు. మరో నలుగురికి ఈసీ అప్రూవల్ తీసుకున్నారు. అయితే వీరి నియామకం నిబంధనల మేరకు కాకుండా.. ఇష్టం వచ్చినవారినే నియమించుకుంటున్నట్లు పెద్దెత్తున విమర్శలు వస్తున్నాయి. పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్లలో జాప్యం చేస్తున్నారు.

'నాన్ టీచింగ్' సమస్యల పరిష్కారమేది?

కేయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా, అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. అయితే ఆకుట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌కు సీనియర్ ప్రొఫెసర్‌గాను, జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారికి ప్రొఫెసర్‌గా పదోన్నతులు కల్పించలేదు. దీంతో వీసీపై వారు ఆరోపణలు చేశారు. పలువురు అధ్యాపకులపై వీసీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. నాన్ టీచింగ్ రెగ్యూలర్, తాత్కాలిక ఉద్యోగుల సమస్యలూ అపరిష్కృతంగా ఉన్నాయి. 73 మంది రెగ్యులర్ ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వాల్సి ఉంది. తాత్కాలిక ఉద్యోగులకు 30 శాతం వేతనాలు పెంచాలి. ఏది అడిగినా న్యాక్ తర్వాతే అని చెప్పడం గమనార్హం.

మౌలిక సదుపాయాలు.. అభివృద్ధి

- రూ.7 కోట్లతో మహిళా వసతి గృహ నిర్మాణం పూర్తి
- కేయూ అడ్మిషన్ల డైరెక్టరేట్ కోసం నిర్మించిన భవనంలో ఏర్పాటు చేయనున్న పీవీ విజ్ఞాన పీఠం
- పరిపాలన భవనంలో సెకండ్ ఫ్లోర్ నిర్మాణం
- దూర విద్యా కేంద్రంలో ఆడియో–వీడియో డిజిటల్ తరగతుల పునరుద్ధరణ
- న్యూ పీజీ బాయ్స్ హాస్టల్‌లో డైనింగ్ హాల్
- పరీక్షా విభాగం ప్రాంగణంలో మహిళా వాష్‌రూమ్
- రూ.కోటితో పరిపాలనా భవనం నుంచి దూర విద్య కేంద్రం వరకు సీసీ రోడ్డు నిర్మాణం
- క్యాంపస్‌లోని ఓ చోట చెక్ డ్యామ్ అభివృద్ధి
- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సౌజన్యంతో రూ 9.20 లక్షల వ్యయంతో మహిళా హాస్టల్ ప్రాంగణంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు
- కేయూలో స్పోర్ట్స్ బోర్డ్‌లో ఉన్న జిమ్ ఆధునికీకరణ
- రూ. 6 కోట్ల వ్యయంతో క్యాంపస్‌లో చివరిదశలో కె హబ్ భవన నిర్మాణం
- విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేలా 34 ప్రతిష్టాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు
- న్యాక్ 'ఏ' గ్రేడ్‌ను నిలబెట్టుకోవాలని వీసీ సుమారు రూ.10 కోట్లకు పైగా వివిధ అభివృద్ధి, మరమ్మతుల పనులు బ్యూటిఫికేషన్‌ను చేయిస్తున్నారు. ఈపనులు పూర్తి కావొస్తున్నాయి.

అన్ని రంగాల్లో అభివృద్ధి


సింగరాజుపల్లి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభలో మంత్రి ఎర్రబెల్లి

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల : పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండల పరిధి పడమటితండా(పెద్దతండా), సింగరాజుపల్లి క్లస్టర్లలో తీగల దయాకర్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభల్లో ఆయన మాట్లాడారు. నాడు ప్రజారంజక పాలనకు ఎన్‌టీఆర్ బీజాలు వేయగా.. నేడు కేసీఆర్ ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రజల మన్ననలు పొందుతున్నాడని పేర్కొన్నారు. ఎడారిలా కనిపించే ఈ ప్రాంతానికి సాగు, తాగు నీరు అందించి సస్యశ్యామలం చేసినట్లు చెప్పారు. కుటుంబ ఆర్థికాభివృద్ధిలో కీలకమైన మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ ఇచ్చి ఉపాధి, ఉద్యోగ కల్పనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరల కారణంగా ప్రజలపై పెనుభారం పడుతోందని, 70 ఏళ్ల పాలనలో ఉన్న పార్టీలు చేసిన అభివృద్ధి శూన్యమని, ఇందుకు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య నిదర్శనంగా నిలిచారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాల అర్థరహిత విమర్శలు తిప్పికొడుతూ దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న బీఆర్ఎస్‌ను బలపర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేశం, జెడ్పీటీసీ పల్ల భార్గవిసుందర్‌రామిరెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, సర్పంచ్‌లు కోక్యా, మల్లేశ్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

అట్టహాసంగా ముగిసిన 'యువ సంఘం'


యువ సంఘం ముగింపు కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, విద్యార్థులు

కాజీపేట అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏక్‌భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన యువ సంఘం కార్యక్రమం సోమవారం నిట్‌లో అట్టహాసంగా ముగిసింది. సంస్కృతీ సంప్రదాయాలను నేటి తరానికి తెలిపేందుకు ఉత్తరాఖాండ్‌కు నిట్ వరంగల్ విద్యార్థులు, నిట్ వరంగల్‌కు ఉత్తరాఖాండ్ ఐఐటీ రూర్కేలాకు చెందిన 45 మంది విచ్చేసి సంస్కృతీ సంప్రదాయాలపై వారం రోజులు అధ్యయనం చేశారు. నిట్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన యువ సంఘం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. దేశవ్యాప్త సంస్కృతీ సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించేందుకు వేదికగా యువ సంఘం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉత్తరాఖాండ్‌కు చెందిన విద్యార్థులు నగరంతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాలను సందర్శించి, గ్రామీణ ప్రాంతాల్లోని జీవన శైలిని, వ్యవసాయాన్ని, యాస, భాషలపై అధ్యయనం చేయడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో యువ సంఘం నోడల్ ఆఫీసర్లు సునీల్‌కృష్ణ, శ్రీనివాస్, విద్యార్థులున్నారు.


ఉత్తరాఖండ్ విద్యార్థులతో నృత్యం చేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

విద్యార్థులతో కలిసి గవర్నర్ నృత్యం

'యువ సంఘం'లో ఆదివారం ఉత్తరాఖాండ్‌కు చెందిన విద్యార్థుల బృందం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆతిథ్యాన్ని స్వీకరించేందుకు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్తరాఖండ్ సంస్కృతీ సంప్రదాయాలను విద్యార్థులు వివరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కల్చరల్ ఫెస్ట్‌లో ఉత్తరాఖండ్ విద్యార్థులతో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆనందంగా నృత్యం చేశారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్లు వైఎస్.రెడ్డి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్‌పై పీడీ యాక్ట్


నిందితుడికి పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేస్తున్న వర్ధన్నపేట సీఐ

వరంగల్ క్రైం: గంజాయి స్మగ్లర్‌పై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వరంగల్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న మహారాష్ట్ర మాలేగావ్ ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్ అలియాస్ యాకూబ్‌పై సీపీ జారీ చేసిన ఉత్తర్వులను సోమవారం వర్ధన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.సదన్‌కుమార్ నిందితుడికి చర్లపల్లి జైలులో అందించారు. యాకూబ్ గతేడాది నవంబర్ 19న మరో ఐదుగురితో కలిసి ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకు గంజాయి రవాణా చేస్తున్న క్రమంలో జాఫర్‌గఢ్ పోలీసులు ఈముఠాను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.10 లక్షల విలువైన వంద కిలోల గంజాయి, రెండు కార్లు, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకొని జైలుకు తరలించారు.

ఐపీఎల్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

- రూ.80 వేల నగదు స్వాధీనం
- నాలుగు ఫోన్లు సీజ్


బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

రామన్నపేట: డాఫాబేట్ యాప్ ద్వారా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఫోర్ట్ రోడ్డుకు చెందిన చింతం సాయికుమార్, చింతం కపిల్, శంభునిపేటకు చెందిన పస్తం వినోద్‌కుమార్, రంగశాయిపేటకు చెందిన గట్టు దర్శనం డాఫాబెట్ యాప్ ద్వారా ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఈనలుగురిని కాశిబుగ్గ చౌరస్తాలో అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.80 వేల నగదు, నాలుగు స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్‌లు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శరత్, లవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఒకరి అరెస్ట్

బయ్యారం: తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగను సోమవారం బయ్యారం పోలీసులు అరెస్ట్ చేశారు. గార్ల–బయ్యారం సీఐ బాలాజీ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన పూనెం రాజు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నాడు. బయ్యారం పోలీస్‌స్టేషన్ పరిధితో పాటు కామేపల్లి, ఇల్లందు, చుంచుపల్లి, ఏన్కూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాజు పలు చోరీలకు పాల్పడగా కేసులు నమోదయ్యాయి. 2022 డిసెంబర్‌లో బయ్యారం స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనాల్లో రాజును అరెస్ట్ చేసి జైలుకు పంపగా.. జైలు నుంచి విడుదలైన తర్వాత తిరిగి మళ్లీ దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈసమాచారం మేరకు రాజును అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.5.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బాలాజీ తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


శ్యామ్ (ఫైల్)

తొర్రూరు: ప్రేమ విఫలమై తొర్రూరులోని చర్చి బజారుకు చెందిన అల్లం శ్యామ్ (26) ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్యామ్ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో పట్టణంలోని ఓ యువతిని ప్రేమించాడు. ఆమె తిరస్కరించడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరి పస్తం స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

అనాథ పిల్లలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే


పిల్లలతో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల: అనాథలైన పిల్లలకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అండగా నిలిచారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అనాథ పిల్లలను పిలిపించుకుని డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా నిత్యావసర సరుకులు, బట్టలు అందించారు. చిట్యాల మండలం పాశిగడ్డ గ్రామానికి చెందిన భూక్య సురేశ్, వసంత అనారోగ్యంతో మూడేళ్ల క్రితం మరణించడంతో వారి పిల్లలు తిరుపతి, లక్‌పతి, సంజన, రాజేశ్ అనాథలయ్యారు. ఇటీవలి వర్ష బీభత్సానికి చిన్నారులు నివాసముంటున్న ఇంటి పైకప్పు లేచిపోయింది. ఈదీనస్థితిని స్థానిక నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. సోమవారం పిల్లలను క్యాంపు కార్యాలయానికి పిలిపించుకొని తక్షణ సాయం కింద నిత్యవసర సరుకులు, బట్టలు అందించారు. వారు నివాసం ఉండేందుకు భూపాలపల్లిలో రెండు పడకల ఇల్లు ఇస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌కు ఫోన్ ద్వారా పిల్లల పరిస్థితి వివరించి త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే.. కలెక్టర్ భవేశ్ మిశ్రాను పిల్లలు కలిశారు. అన్ని విధాలా అండగా ఉంటానని కలెక్టర్ పిల్లలతో అన్నారు. కార్యక్రమంలో చిట్యాల జెడ్పీటీసీ గొర్రె సాగర్, గ్రామ సర్పంచ్ లావుడ్యా రజిత హరిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రితో కలిసి తమ్ముడిపై దాడి

- తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి
- ఆస్తి తగాదాలే కారణమంటున్న గ్రామస్తులు


కృష్ణ (ఫైల్)

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో తండ్రితో కలిసి తమ్ముడిపై దాడి చేయగా మామిడ్ల కృష్ణ (32) సోమవారం మృతి చెందాడు. మామిడ్ల రాములుకు ముగ్గురు కుమారులు. అంజనేయులు, కృష్ణ, మల్లేశం. ముగ్గురికీ వివాహాలై నెల్లుట్లలో ఉంటున్నారు. అంజనేయులు, మల్లేశం రైల్వేలో బిల్ల కూలీలుగా పని చేస్తుండగా.. కృష్ణ గ్రామంలోనే ట్రాక్టర్ కొనుక్కొని జీవనోపాధి పొందుతున్నాడు. నెల్లుట్ల బైపాస్ సమీపంలోని బీజేపీ కార్యాలయం పక్కనే తండ్రి రాములు పేరుతో ఉన్న 500 గజాల ప్లాటును ఇటీవలే కృష్ణకు తెలియకుండా తండ్రి, అన్న అంజనేయులు, తమ్ముడు మల్లేశం అమ్ముకున్నారు. విషయం తెలుసుకున్న కృష్ణ ప్లాటు అమ్మిన డబ్బులు తనకు కూడా ఇవ్వాలని వారిని అడిగినట్లు తెలిసింది. దీంతో ఈనెల 19న వీరి మధ్య గొడవ జరిగి కృష్ణను రాములు, అంజనేయులు కలిసి తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. తలకు తీవ్ర గాయాలైన కృష్ణను హైదరాబాద్‌లోని ఆదిత్య ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అతడు సోమవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈవిషయంపై ఎస్సై ప్రవీణ్‌ను వివరణ కోరగా.. తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఆదిత్య ఆస్పత్రి యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడగా.. మెట్లపై నుంచి పడ్డాడని చెప్పి ఆస్పత్రిలో చేర్పించారని చెప్పారు. ఆస్పత్రికి వెళ్లి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యకు దారి తీసిన వివాహేతర సంబంధం


వెంకటేశ్ (ఫైల్)

గార్ల: వివాహేతర బంధం కొనసాగిస్తూ, వివాహితను పెళ్లి చేసుకుంటానంటే, తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో గార్లకు చెందిన బాణాల వెంకటేశ్(25) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గార్లలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం బజార్‌కు చెందిన వెంకటేశ్ తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈక్రమంలో కొంత కాలంగా అదే బజారుకు చెందిన ఓ వివాహితతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఇటీవల ఆమె భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. ఈక్రమంలో వెంకటేశ్ ఆమెనే పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులకు చెప్పాడు. కానీ తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన వెంకటేశ్ ఇంట్లో ఎవరూ లేని సమయంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. 'ఇంటికి పెద్ద కొడుకువు.. మమ్ముల్ని సాకుతావని ఆశలు పెట్టుకుంటిమి కదరా కొడుకా.. గింతపని చేస్తవనుకోలేదు కొడుకా' అంటూ తల్లితండ్రులు రోదించిన తీరు అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి శ్రీనివాసాచారి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకున్నట్లు గార్ల ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు.

విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హన్మకొండ కల్చరల్: ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు వోపాస్ ప్రతిభా పురస్కారాలు, నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు వరంగల్ జిల్లా విశ్వ బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అభ్యుదయ సంఘం (వోపాస్) అధ్యక్షుడు సిద్దోజు విద్యాసాగర్ తెలిపారు. సోమవారం సుబేదారిలోని సంఘం కోశాధికారి వలబోజు కేశవరావు గృహంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జూన్ 25వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 91541 02640, 95026 78767 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వ్యవస్థాపకులు కట్టా సత్యనారాయణచారి, డాక్టర్ అనసూరి చంద్రమౌళి, సభ్యులు గురుబ్రహ్మం, వేల్పుల దేవాచారి, సదానందచారి, శ్రీపాద సుధాకర్‌రావు, రాజ్‌కుమార్, దేవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వోపాస్ అధ్యక్షులు విద్యాసాగర్

ఫిజియోథెరపీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వంశీకృష్ణ, రాకేశ్


వంశీకృష్ణ


రాకేశ్

కమలాపూర్: ఉమ్మడి వరంగల్ జిల్లా ఫిజియోథెరపీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ సిరికొండ వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ గుండు రాకేశ్ ఎన్నికయ్యారు. ఈమేరకు ఆదివారం రాత్రి జరిగిన ఎన్నికల్లో వంశీకృష్ణ ప్యానల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వొడితెల రాము తెలిపారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ చిరంజీవి, కార్యదర్శులుగా రామకృష్ణ, శైలజ, ప్రధాన కార్యదర్శులుగా మోసిన్, సుకుమార్, రఘుపతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కమలాకర్, సామ్రాట్, హరీశ్, కోశాధికారిగా వొడితెల రాము, మహిళా కో–ఆర్డినేటర్లు కృపాశాలిని, ప్రసన్న, అడ్వైజరీ కమిటీ సభ్యులుగా సునీల్ కిరణ్, శివరామకృష్ణ, హేమంత్‌రాజ్, క్రాంతిని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

పిడుగుపాటుతో మూగజీవాల మృత్యువాత


ఆవు వద్ద విలపిస్తున్న రైతు సిద్ధులు

నర్మెట: మండలంలోని ఇప్పలగడ్డలో సోమవారం తెల్లవారు జామున పిడుగుపడి రైతు గరిగె వీరస్వామికి చెందిన ఆవు, దూడ మృతి చెందాయి. రైతుకు రూ.లక్ష నష్టం వాటిల్లింది. బొమ్మకూరులోని రావుల మల్లయ్య కొనుగోలు చేసిన ఒంగోలు జాతి మేలు రకం కాడెడ్లు రెండు పిడుగుపాటుతో మృతి చెందాయి. రూ.2 లక్షలు నష్టం వాటిల్లింది.

ఉప్పేనుగూడెంలో మరో ఆవు..

జనగామ రూరల్: మండలంలోని ఎర్రగొల్లపహాడ్ గ్రామ పరిధి ఉస్తేనుగూడేనికి చెందిన ఉస్తేపు సిద్ధులుకు చెందిన ఆవుపై సోమవారం తెల్లవారు జామున పిడుగుపడింది. రైతు ఎప్పటిలాగే తన వ్యవసాయ బావి వద్ద ఆవును ఉంచి ఇంటికి వెళ్లగా.. ఉదయం పడిన పిడుగుపాటుతో తన రూ.65 వేల విలువైన ఆవు మృతి చెందింది. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.